ఖరీఫ్ సాగుకు శ్రీకారం



విత్తన శుద్ధి చేస్తున్న రైతులు



గొల్లహట్టి వద్ద వేరుశనగ విత్తుతున్న దృశ్యం

మడకశిర రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల నైరుతి రుతుపవనాలతో విస్తారంగా కురిసిన వర్షాలకు వ్యవసాయ భూములను పంట సాగుకు సిద్ధం చేసుకున్నారు. ఆదివారం మండలంలో వివిధ గ్రామాల్లో రైతన్నలు విత్తన వేరుశనగ సాగుకు శ్రీకారం చుట్టారు. వర్షాలకు మంచి పదును కావడంతో మాశేరొప్పం, గొల్లహట్టి, మెళవాయి తదితర గ్రామాల్లో విత్తన వేరుశనగ శుద్ధి చేసుకుని సాగు చేశారు. ఇప్పటికే 8 ఎకరాల్లో విత్తన వేరుశనగ సాగు చేసినట్లు రైతు చిక్కన్న తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి విత్తనాలు విత్తుకుంటున్న రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తూ.. పలు సూచనలు, సలహాలు అందించాలని కోరుతున్నారు.

సాళ్ల పద్ధతిలో సాగు..

మండలంలో బోరు బావుల కింద దాసరిబండ, ఎల్లోటి, జక్కేపల్లి, చందకచెర్లు తదితర గ్రామాల్లో రైతులు సాళ్ల పద్ధతిలో మొక్కజొన్న, పత్తి విత్తనాలను విత్తుకున్నారు. జూన్ నెలలో సాగు చేస్తే పంటలో మంచి దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

నీటి సౌకర్యం ఉండటంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న పంట సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. మేలు రకమైన విత్తనాలను కొనుగోలు చేసి ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తున్నారు.

ముందుకు కదలని మురుగు



కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

హిందూపురం అర్బన్: పట్టణంలోని ప్రధాన మురుగుకాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు పోవడం లేదు. దీంతో పలుచోట్ల దుర్గంధం వెదజల్లుతోంది. వివరాల్లో కెళితే.. పట్టణంలోని కొట్నూరు కాలువ, శ్రీ కంఠాపురం కాలువ, సూరప్ప కుంట కాలువ నుంచి పట్టణం మీదుగా మురుగువస్తుంది. పట్టణ చివర ఎస్‌డీజీఎస్ కళాశాల అవతల(పాత ఆర్టీఓ ఆఫీస్) చివర, పట్టణంలోని బాలాజీ సర్కిల్, కొట్నూరు చెరువుకు వచ్చే కాలువల నిండా తాగి పారేసిన వాటర్ బాటిళ్లు, జ్యూస్ బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగునీరు ముందుకు కదలని పరిస్థితి. వర్షం వస్తే పై కాలువలకు ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడి వర్షపునీటితో పాటు మురుగునీరు రోడ్లపై పారుతోంది. దీంతో పట్టణ వాసులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. అధికారులు స్పందించి కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. 2008–2011 సంవత్సరం డిగ్రీ విద్యార్థులు కళాశాలలో కలుసుకొని, గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి అధ్యాపకులను సన్మానించారు. భవిష్యత్తులో కళాశాల అభివృద్ధికి కృషి చేద్దామని నిర్ణయించారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, పీడీ జయరామప్ప, పూర్వ విద్యార్థులు నరసింహం, రామన్న, మహేష్, ఆనంద్, ఫర్వాజ్ పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటాం'



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని స్థానిక నాయకులు తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగును ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు తొలగించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అంతేకాకుండా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. ఓటమితో కుంగిపోవద్దని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ వైఎస్ జగన్‌దే అని తెలిపారు. కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. మడకశిర ప్రాంతంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూడాలని కోరారు. అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు విక్రమ్, నాగేంద్ర, ఫక్రుద్దీన్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాజ్, అంజలి, మధు, గోపి, నగేష్, మధుసూదన్, రవీంద్రారెడ్డి, నాగభూషణ్, సర్పంచులు నరసింహమూర్తి, హనుమంతప్ప, కరియన్న తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహ్లాదకరం..అటవీ ప్రాంతం




పెనుకొండ అటవీ ప్రాంతంలో పరుచుకున్న పచ్చదనం

పెనుకొండ: పెనుకొండ పరిధిలోని అటవీ ప్రాంతంలో వేసవిలో ఎటుచూసినా ఎండిపోయిన చెట్లు, బోసిన పంట పొలాలు కనిపించేవి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పచ్చదనం పరుచుకుంది. చెట్లు చిగురించాయి. పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి. పెనుకొండ రేంజ్ అటవీప్రాంతం దాదాపు 25 వేల హెక్టార్లలో ఉంది. పులేకమ్మ ఆలయం, దొడ్డికుంట, పులేకమ్మ ఆలయం, గోనిపేట పట్టణ సమీపంలోని ప్రాంతాల్లో కనుచూపుమేర పచ్చదనం కనిపిస్తోంది. హిందూపురం – అనంతపురం రహదారి మీదుగా ప్రయాణించే వారికి ఆహ్లాదకరం పంచుతోంది.



జాతీయ రహదారి పక్కన పచ్చగా కనిపిస్తున్న అటవీప్రాంతం

వైభవంగా కైవారం తాతయ్య ఉత్సవం



పూజలు అందుకున్న తాతయ్య మూలవిరాట్



భజనలు చేస్తున్న భక్తులు

హిందూపురం: కై వారం క్షేత్రంలో ఆదివారం తాతయ్య జీవ సమాధి ఉత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవానికి హిందూపురం నుంచి వందలాది మంది తరలివచ్చారు. ఈసందర్భంగా తాతయ్య మూలవిరాట్‌కు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రం ఆవరణలో భజనలు చేశారు. కార్యక్రమానికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చినట్లు హిందూపురం సద్గురు యోగినారాయణ సేవాసమితి సభ్యులు తెలియజేశారు.

నేడు నవరత్నాలు నాటిక ప్రదర్శన

రొద్దం: మండల పరిధిలోని శ్యాపురంలో సోమవారం రాత్రి 9 గంటలకు నవరత్నాలు అనే పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందని హాస్య నటుడు కోగిర జయచంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రఖ్యాత కళాకారులు దూపం రామకృష్ణ, దూపం తిరుమల తేజ, గౌరీపురం కృష్ణ, చిట్టిబాబు, నెల్లూరు, పెట్టపర్తి కేశన్న, పైడి రాజు, కోగిర జయచంద్రారెడ్డి, విజయ శారద నటిస్తున్నట్లు తెలిపారు.

స్థానిక చరిత్రల అధ్యయనం ఉపయుక్తం



నొళంబవాడి పుస్తకాన్ని పరిచయం చేస్తున్న అనంత రచయితలు

అనంతపురం కల్చరల్: నొళంబుల చరిత్రను రికార్డు చేయడం ఒక సాహసోపేతమైన ప్రయత్నమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి కొనియాడారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సిద్దగిరి శ్రీనివాస్ రచించిన 'నొళంబవాడి' పుస్తక పరిచయ సభ జరిగింది. జిరసం అధ్యక్షుడు డాక్టర్ జెన్నే ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బండి నారాయణ స్వామి, సత్యసాయి జిరసం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, అడవాళ శేషగిరి నాయుడు, బండి నాగరాజు, పోతుల రాధాకృష్ణ, పుస్తక సమీక్షకుడు డాక్టర్ అంకె శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. మడకశిర ప్రాంతానికి చెందిన రచయిత సిద్దగిరి శ్రీనివాస్ తన స్థానిక చరిత్రను రికార్డు చేయడంలో సఫలీకృతులయ్యారన్నారు.

అదే స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని వక్తలు సూచించారు. చరిత్ర అధ్యయనం నానాటికి కుంటుపడుతుండటం విచారకరమన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సునిశితమైన పరిశీలన జ్ఞానం గొప్ప పుస్తకానికి తొలి మెట్టుగా మారిందని రచయితను పలువురు కొనియాడారు. అదేవిధంగా సిద్దగిరి శ్రీనివాస్ ఆసక్తికరమైన జిల్లా చరిత్ర విశేషాలను తెలియజేసి ఆకట్టుకున్నారు. ఒక మహాసామంత రాజ్యపు చరిత్రను కళ్లకు కట్టినట్టు వివరించారు. అనంతరం జిరసం కార్యవర్గంతో కలిసి ఎలేక్రపీ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, అమరనాథరెడ్డి, వన్నప్ప, నబీరసూల్, రియాజుద్దీన్, షరీఫ్, చేగువేరా హరి, అలీఖాన్ తదితరులు రచయితను ఘనంగా సత్కరించారు.

రేపు గంగమ్మతల్లి జ్యోతుల ఉత్సవం

హిందూపురం: స్థానిక కొటిపి రోడ్డు మోడల్‌కాలనీలోని వెలసిన గంగమ్మ తల్లి, జలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం గంగమ్మ తల్లికి జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో మూడేళ్ల ఒకసారి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కర్ణాటక ప్రాంతం నుంచి బెస్త కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారన్నారు. ప్రసాదాల పంపిణీతోపాటు అల్పాహార సదుపాయం ఏర్పాటు చేసినట్లు బెస్త సంఘం అధ్యక్షుడు బెస్త లక్ష్మీనారాయణ తెలిపారు.

398 హెక్టార్లలో వేరుశనగ సాగు

మడకశిర: నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 398 హెక్టార్లలో రైతులు వేరుశనగ పంటను సాగు చేసినట్లు స్థానిక ఏడీఏ కృష్ణమీనన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మడకశిర మండలంలో 8, అమరాపురం మండలంలో 50, గుడిబండ మండలంలో 280, అగళి మండలంలో 60 హెక్టార్లలో పంట సాగైనట్లు వెల్లడించారు. రొళ్ల మండలంలో ఇంత వరకు ఎవరూ కూడా వేరుశనగ పంట సాగు చేయలేదని తెలిపారు. వరుణుడు కరుణించడంతో వేరుశనగ సాగు పనులు ఊపందుకునే అవకాశం ఉందన్నారు. జూలై 15 వరకూ వేరుశనగ పంట సాగుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు.

హాయిరే హాయ్..ఈత కొట్టురోయ్



బావిలోకి డై కొడుతున్న చిన్నారి



బావిలోకి దూకుతున్న బాలుడు

పెనుకొండ: వేసవి ముగిసింది. వర్షాలు భారీగా కురుస్తున్నాయి. త్వరలో వేసవి సెలవులు ముగుస్తున్నాయి. మూడు, నాలుగు రోజుల్లో బడిబాట పట్టాల్సిన పిల్లలు.. బావి బాట పట్టారు. ఎండవేడిమికి తాళలేక బావుల్లో ఉత్సాహంగా ఈత కొడుతూ ఇలా వేసవితాపాన్ని తీర్చుకుంటున్నారు. పెనుకొండ వద్ద వ్యవసాయతోటల్లో బావులు, పట్టణ సమీపంలో స్విమ్మింగ్ పూల్స్ సందడిగా కనిపిస్తున్నాయి. పెనుకొండ సమీపంలో నిండుగా నీరున్న ఓ బావిలో ఆదివారం సరదాగా చిన్న,పెద్ద తేడాలేకుండా సరదాగా ఈత కొడుతూ, సేదతీరుతూ కనిపించారు.

క్లుప్తంగా

బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం: చౌళూరు పంచాయతీలోని రామచంద్రపురంలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన బాధితులను ఆదివారం వైఎస్సార్‌సీపీ నేత చౌళూరు మధుమతిరెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి దాడుల సంస్కృతి హిందూపురం ప్రాంతంలో ఎన్నాడూ లేదన్నారు. టీడీపీ నాయకులు ఇప్పటికైనా ఇలాంటివి మానుకోవాలని కోరారు. ఘర్షణలు, దాడులు అభివృద్ధికి ఆటంకాలన్నారు. దాడి చేసిన వారిలో చౌళూరు రామక్రిష్ణరెడ్డి హత్య కేసు ముద్దాయి కూడా ఉండటంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు.

కరాటే బెల్ట్ పరీక్షలు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

హిందూపురం: పట్టణంలోని దీప్తి స్కూల్‌లో ఆదివారం ఎస్.ఫైరోజ్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన 56 మంది విద్యార్థులకు కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఏఎస్‌గోజు ర్యూ కరాటే ఆల్ ఇండియా చీఫ్ క్యోషి అల్తాఫ్ పాషా నేతృత్వంలో పరీక్షలు జరిగాయి. బెల్ట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్, బెల్ట్‌లను అందచేసి అభినందించారు. కార్యక్రమంలో కరాటే సీనియర్లు హేమంత్, ఉషా, చరణ్, నరేష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక ఎంజీఎం హైస్కూల్‌లో ఆదివారం ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ గ్రాండ్ మాస్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్ష నిర్వహించారు. కరాటేలో శిక్షణ పొందిన 30 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు మహేంద్ర, దర్శన్, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సుందరరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న సుందరరాజు

లేపాక్షి: లేపాక్షిలోని మాహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా సుందరరాజు ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్ కడప జిల్లా తొండూరు గురుకుల పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ ముస్తాఫాతో పాటు అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతు అధ్యాపకులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని పాఠశాల అభివృద్ధితో పాటు మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

బాధితురాలికి ఆపన్నహస్తం



బాధితురాలి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన ఓ మహిళ వైద్యం కోసం వాలీబాల్ క్రీడాకారులు ఆపన్నహస్తం అందించారు. వివరాలు.. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన అంజప్ప, తిప్పమ్మల కుమార్తె గౌరీ అనారోగ్యంతో బెంగళూరులో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న అదేనగర్‌కు చెందిన వాలీబాల్ క్రీడాకారులు ఆదివారం రూ.15వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మున్సిపల్ మేనేజర్ నరసింహులు, సీఐ శ్రీనివాసులు, చలంబాబు, శంకర్, రమణ, కొండప్ప, వెంకటేషులు, రామచంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమస్యలను విన్నవిస్తున్న కాలనీ ప్రముఖులు

పావగడ: స్థానిక హరిజన వాడలో నెలకొన్న విద్యుత్, మురుగు సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఐ జయరాంకు కాలనీ ప్రముఖులు విన్నవించారు. ఆదివారం గ్రామంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఎస్సీ ఎస్టీ వర్గాల సభలో కాలనీ ప్రముఖులు ఆంజనేయ, రామకృష్ణ మాట్లాడారు. చాలా రోజుల నుంచి కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదని ఆరోపించారు. అదే విధంగా అక్రమ మద్యం అమ్మకాలతో ఘర్షణలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. వెంటనే అక్రమ మద్యం అమ్మకాలను నివారించి కాలనీలో శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. ప్రతి ఎస్సీ, ఎస్టీ సభలో సమస్యలు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని వాపోయారు.

'నీట్'గా సాధించాడు..



ప్రజ్వల్

పావగడ: తాలూకాలోని బి.హొసహళ్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మరిస్వామి రెడ్డి, స్వాతి దంపతుల కుమారుడు ప్రజ్వల్ నీట్ పరీక్షల్లో సత్తా చాటాడు. 710 మార్కులతో ఉత్తమ ర్యాంకు సాధించి పలువురి ప్రశంసలు పొందాడు. చిన్నతనంలో చదువుపై అంతగా ఆసక్తి లేని ప్రజ్వల్ తన తండ్రి వెంట పొలం పనులకు వెళ్లేవాడు. అయితే తండ్రి మరిస్వామి రెడ్డి తన కొడుకుకు నచ్చచెప్పి మంగళూరు ప్రాంతంలో విద్యాభ్యాసం చేయించాడు. అప్పటి నుంచి ప్రజ్వల్ దీక్ష పట్టుదలతో చదువులో రాణించాడు. మెడిసిన్ చేయాలనే ఆకాంక్షతో నీట్ పరీక్ష రాసి 720 మార్కులకు గాను 710 మార్కులు సాధించాడు. ప్రజ్వల్ ప్రతిభపై తల్లిదండ్రులు, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, అంజన నాయక తదితర గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సిద్ధేశ్వరుడికి ప్రత్యేక పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన సిద్ధేశ్వర స్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి త్రికాల పూజలైన సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఆదివారం సెలవు కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాలైన పావగడ, శిర, హిరియూర్, మధుగిరి, తుమకూరు, బెంగళూరు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది.

చెత్త తొలగించి.. ఆదర్శంగా నిలిచి



మురుగు కాల్వను శుభ్రం చేస్తున్న వృద్ధుడు

పావగడ: పట్టణంలోని 22వ వార్డుకు చెందిన కన్మాస్ చెరువు ప్రాంతంలో మసీదు వెనుక భాగంలో బాషా సాహెబ్ ఇంటి వద్ద ఉన్న మురుగు కాలువ వ్యర్థ పదార్థాలతో నిండి పోయి దుర్వాసన వస్తోంది. ఈ నేపథ్యంలో ఇంటి యజమాని బాషా సాహెబ్ స్థానిక మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు విన్న వించుకున్నా పట్టించుకోలేదు. మురుగు కాల్వలో చెత్తా చెదారం పేరుకుని మురుగు నీరు ముందుకు సాగక అక్కడే నిల్వ ఉండి ఆ ప్రాంత మంతా దుర్వాసన వస్తోంది. వాసన భరించలేక చివరకు బాషా సాహెబ్ పార చేత పట్టుకుని తానే స్వయంగా మురుగు కాల్వలో దిగారు. ఒక్క రోజులో చెత్తా చెదారం తొలగించారు. మురుగు కాల్వను శుభ్రం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

వ్యవసాయ పరికరాల అపహరణ

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు గ్రామంలో తలారి శీనప్ప అనే రైతు పొలంలోని రేకుల షెడ్డులో ఉంచిన ఎరువుల బస్తాలు, విద్యుత్ పరికాలు, పైపులు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఎత్తుకెళ్లారు. దాదాపు రూ.50వేలు నష్ట పోయినట్లు బాధితుడు తెలిపాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

ఆర్బీకేలో చోరీకి విఫలయత్నం

చిలమత్తూరు: పాతచామలపల్లి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో ఓ దుండగుడు చోరీ చేసేందుకు విఫలయత్నం చేశాడు. వివరాలు.. గుర్తు తెలియని దుండగుడు ఆదివారం రాత్రి ఆర్బీకే షట్టర్ తాళాలు పగులగొట్టి రైతులకు పంపిణీ చేయాల్సిన విత్తన వేరుశనగ బ్యాగులను ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. గ్రామస్తులు గమనించి అరవగా దొంగ అక్కడి నుండి పరారయ్యాడు.

'అదృష్టం వరించింది'



దీపిక

పావగడ: ఇటీవల వెలువడిన పది పరీక్షల ఫలితాల్లో 586 మార్కులు సాధించి ర్యాంకు రాలేదన్న దిగులుగా ఉన్న దీపికను రీ వాల్యుయేషన్ రూపంలో అదృష్టం వరించింది. సైన్స్ పరీక్ష పేపర్‌ను రీ వాల్యుయేషన్ చేయగా అదనంగా 24 మార్కులు రావడంతో మొత్తం 610 మార్కులు సాధించింది. మొత్తం 625 మార్కులకు గాను 610 మార్కులు సాధించిన దీపిక తాలూకాలో తృతీయ స్థానంలో నిలిచింది. ఉత్తమ మార్కులు సాధించిన దీపికను సహన పాఠశాల ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంట్ అభినందించారు.